సాక్షి అనంతపురం

శనివారం। 10। ఆగస్టు। 2024



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



నిండుకుండలా తుంగభద్ర

తుంగభద్ర డ్యాం నీటితో నిండుకుండలా ఉంది. శుక్రవారం సాయంత్రానికి 105.507 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
36.2°/22.9°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

వాయిదా స్కూళ్లల్లో 17న ఎన్నికలు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో వాయిదా పడ్డ స్కూళ్లల్లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికల నిర్వహణకు శనివారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మధ్యాహ్నానికి ఆయా పాఠశాలల నోటీస్‌బోర్డులో ఓటర్ల జాబితాలను ప్రదర్శిస్తారు. 12న ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి.. తిరిగి జాబితాను సరిచేసి ప్రదర్శిస్తారు. 17న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు ఎన్నికలు నిర్వహించనున్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు సభ్యులందరూ ప్రమాణ స్వీకారం చేస్తారు. మూడు గంటలకు ఎస్‌ఎంసీ తొలి సమావేశం నిర్వహించి మినిట్స్ బుక్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని డీఈఓ వరలక్ష్మీ, సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు తెలిపారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం రూరల్: గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం గిరిజన భవన్‌లో ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అన్ని విధాలా ముందుకు పోవాలన్నారు. గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పిల్లలను ఉన్నతంగా చదివించుకోవడంతో పాటు ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. అనంతరం గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకులు గుజ్జల లక్ష్మణ్‌కుమార్, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రూ.53 లక్షల విలువైన సెల్‌ఫోన్ల రికవరీ



బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనంతపురం: చాట్‌బాట్ సేవల ద్వారా రికవరీ చేసిన రూ.53 లక్షల విలువైన 266 సెల్‌ఫోన్లను సంబంధీకులకు ఎస్పీ కేవీ మురళీకృష్ణ శుక్రవారం అందజేశారు. వీటిలో మిస్ అయినవి 221 కాగా, చోరీకి గురైనవి 45 ఉన్నాయి. శుక్రవారం అందజేసిన వాటితో కలిపి జిల్లా పోలీస్‌శాఖ ఇప్పటి వరకూ 8,886 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. మొత్తం వీటి విలువ రూ.15.04 కోట్లు అని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు చోరీకి గురై అవి ఇతర రాష్ట్రాలకు చేరినా రాజీపడకుండా రికవరీ చేసి సంబంధీకులకు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లాలో 183, శ్రీసత్యసాయి జిల్లా 41, కర్నూలు 15, కర్ణాటక 11, తెలంగాణలో 6 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ చోరీ అయినా.. లేదా ఎక్కడైనా మిస్ అయినా వెంటనే చాట్‌బాట్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సెల్‌ఫోన్ల రికవరీలో చొరవ చూపిన జిల్లా సైబర్ క్రైమ్ విభాగం సీఐ షేక్ జాకీర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పంద్రాగస్టు వేడుకలకు గుంతకల్లు విద్యార్థి



విద్యార్థి సంజీవరాయుడిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుంతకల్లుటౌన్: దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట వద్ద ఈ నెల 15న జరిగే స్వాతంత్య్ర దినోత్సవాల్లో నిర్వహించే పరేడ్‌లో పాల్గొనే అవకాశం గుంతకల్లులోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి కె.సంజీవరాయుడికి దక్కింది. కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న సంజీవరాయుడు... ఎన్‌ఎస్‌ఎస్ విభాగం తరఫున పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు.

పింఛన్లకు ఎసరు!

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో చంద్రకళ భర్తకు దూరమై పదేళ్లవుతోంది. ఒంటరిగా తన తల్లి ఇంట్లో ఉంటూ దినసరి కూలీగా జీవనం సాగిస్తోంది. ఆమెకు గత ప్రభుత్వం విచారణ జరిపించి ఒంటరి మహిళ పింఛను మంజూరు చేసింది. వలంటీర్ నేరుగా లబ్ధిదారు ఇంటికి వెళ్లి ప్రతి నెలా రూ.3 వేల పింఛను అందజేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఒంటరి మహిళ పింఛన్లపై విచారణ చేయిస్తుండటంతో తనకు ఎక్కడ రద్దు చేస్తారోనని ఆమె ఆందోళన చెందుతోంది.



- డప్పు, చర్మకారుల పింఛన్లకు కొర్రీలతో కత్తెర
- ఒంటరి, వితంతు మహిళల అర్హతలపై వడపోత
- కూటమి ప్రభుత్వంపై పింఛనుదారుల మండిపాటు

జిల్లాలో కళాకారుల పింఛన్లు ఇలా..

పింఛన్ రకం	లబ్ధిదారులు	అందుతున్న మొత్తం
చర్మకారులు	3,506	రూ.1.40 కోట్లు
డప్పు కళాకారులు	3,129	రూ.1.25 కోట్లు
వివిధ రకాల కళాకారులు	182	రూ.7.28 లక్షలు



కళ్యాణదుర్గం: రాష్ట్రంలో టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి అధికారంలోకి వచ్చాక అవుట్ సోర్సింగ్ సిబ్బంది, రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్లు ఇలా ప్రతి చిరుద్యోగినీ తొలగిస్తూ పొట్టకొట్టారు. తాజాగా ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లపై పడ్డారు. తొలుత డప్పు, చర్మ కారులు, తర్వాత వితంతు, ఒంటరి మహిళల అర్హతలపై దృష్టి సారించారు. జిల్లాలో 3,506 మంది చెప్పులు కుట్టే (చర్మకారులు), 3,129 మంది డప్పు కళాకారులు.. మొత్తం 6,635 మంది వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వం నెలవారీ పింఛను కింద రూ.2.65 కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. ప్రస్తుతం వీరందరి పింఛన్లకు ఎసరు పెట్టింది.

ఏరివేతకు సర్వే

జిల్లా వ్యాప్తంగా డప్పు, చర్మకారుల పింఛన్లు ఏరివేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామాల వారీగా సర్వే చేసేందుకు ఆయా డివిజన్లలోని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌లను ఆదేశించింది. దీంతో క్షేత్రస్థాయిలోకి వెళ్లిన ఏఎస్‌డబ్ల్యూ అధికారులు డప్పు, చర్మ కారుల పింఛన్లపై విచారణ చేయడంపై ఆయా కళాకారులు మండిపడుతున్నారు.

ఒంటరి, వితంతు మహిళలపైనా కక్ష

డప్పు, చర్మకారులే కాదు కూటమి ప్రభుత్వం వచ్చాక ఒంటరి మహిళలు, వితంతువుల పింఛను దారుల్లోనూ భయం మొదలైంది. ఒంటరి మహిళలైతే భర్త నుంచి విడాకులు తీసుకున్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని టీడీపీ, కూటమి నేతలు కొందరు సచివాలయ అధికారులకు హుకుం జారీ చేస్తున్నారని సమాచారం. భర్త తోడు లేక పదేళ్లుగా తల్లిదండ్రుల వద్ద ఉంటున్న ఒంటరి మహిళలు సైతం గత ప్రభుత్వంలో పింఛను పొంది జీవనం సాగించేవారు. ఇప్పుడు పింఛన్లు తొలగిస్తే వారి పరిస్థితి మరింత అగమ్యగోచరంగా ఉంటుందని పలువురు వాపోతున్నారు. ఇక వితంతు పింఛన్లు తీసుకునే వారు బోగస్ సర్టిఫికెట్లు పెట్టి భర్త బతికున్నా పింఛను తీసుకుంటున్నారని కూటమి నేతలు అధికారులకు ఫిర్యాదులు చేశారు. తద్వారా వారి పింఛన్ల తొలగింపునకు కుట్ర పన్నుతున్నారు.

ఫిర్యాదులపై విచారణ

ఇటీవల కుందుర్పి మండలం జంబుగుంపల పంచాయతీలో డప్పు కళాకారులు, చర్మకారుల పింఛన్లపై టీడీపీ నేతలు ఫిర్యాదులు చేశారు. డప్పు, చర్మకారులందరూ బోగస్ పింఛన్లు తీసుకుంటున్నారని చెప్పడంతో పంచాయతీలో విచారణ చేపట్టాం. పింఛను దారుల ధ్రువీకరణ పత్రాలతో పాటు బోగస్ అని చెప్పేవారి ఆధారాలు కూడా అడిగాం. జిల్లా అధికారులకు పూర్తి ఆధారాలతో నివేదికలను అందజేస్తాం.

– దామోదర్‌రెడ్డి, ఏఎస్‌డబ్ల్యూ, కళ్యాణదుర్గం

వేళాంగణి మాత ఉత్సవాలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

గుంతకల్లు: తమిళనాడులో ప్రసిద్ధి గాంచిన వేళాంగణి మాత ఉత్సవాలకు వెళ్లే భక్తులను దృష్టిలో ఉంచుకుని ముంబై ఎల్‌టీటీ–వేళాంగణి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న ముంబై ఎల్‌టీటీ జంక్షన్ (01161) నుంచి మధ్యాహ్నం 1.00 గంటలకు బయలుదేరి 27వ తేదీ రాత్రి 11.50 గంటలకు వేళాంగణి రైల్వేస్టేషన్‌కు చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు 28వ తేదీ వేళాంగణి రైల్వేస్టేషన్ (01162) నుంచి వేకువజామున 3.00 గంటలకు బయలుదేరి 29వ తేదీ సాయంత్రం 4.20 గంటలకు ముంబై ఎల్‌టీటీ జంక్షన్‌కు చేరుతుందన్నారు. అదేవిధంగా సెప్టెంబర్ 7వ తేదీ ముంబై ఎల్‌టీటీ జంక్షన్ (01163) నుంచి మధ్యాహ్నం 1.00 గంటకు బయలుదేరి 8వ తేదీ రాత్రి 11.50 గంటలకు వేళాంగణి రైల్వేస్టేషన్‌కు చేరుతుందని పేర్కొన్నారు. తిరిగి ఈ రైలు సెప్టెంబర్ 9వ తేదీ వేకువజామున 3.00 గంటలకు బయలుదేరి ముంబై ఎల్‌టీటీ జంక్షన్‌కు 10వ తేదీ సాయంత్రం 4.20 గంటలకు ముంబై ఎల్‌టీటీ జంక్షన్ చేరుతుందని తెలిపారు. ఈ రైళ్లలు రాయలసీమలోని మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, కడప, రేణిగుంట జంక్షన్‌ల మీదుగా రాకపోకలు సాగిస్తున్నట్లు వివరించారు.

బెంగళూరు–కలబురిగి మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దష్ట్యా బెంగళూరు–కలబురిగి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 14, 16, 17 తేదీల్లో బెంగళూరు జంక్షన్ నుంచి రాత్రి 9.15 గంటలకు (06533) బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.45 గంటలకు కలబురిగి జంక్షన్‌కు చేరుతుందన్నారు. అదేవిధంగా ఈ నెల 15, 17, 18 తేదీల్లో కలబురిగి జంక్షన్ నుంచి ఉదయం 9.30 గంటలకు (06534) బయలుదేరి బెంగళూరు జంక్షన్‌కు రాత్రి 8.00 గంటలకు చేరుతుందన్నారు. ఈ రైళు యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, యాద్గిరి, షాబాద్‌ల మీదుగా రాకపోకలు సాగిస్తున్నట్లు వెల్లడించారు.

... అలా తాగి పడేశారు!

- జూలై నెలలోనే రూ.120 కోట్ల విలువైన మద్యం వినియోగం
- నియంత్రణ లేకపోవడమే విచ్చలవిడి మద్యానికి కారణం



గడిచిన నాలుగు మాసాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం వినియోగం ఇలా

నెల	లిక్కర్ (కేసుల్లో)	బీర్ (కేసుల్లో)	విలువ
ఏప్రిల్	1,29,424	51,707	రూ.119,94,28,510
మే	1,31,980	38,842	రూ.118,26,71,780
జూన్	1,19,657	36,377	రూ.108,90,89,860
జూలై	1,32,418	42,686	రూ.120,84,43,710

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్యం తాగినోడికి తాగినంత అన్నట్టుంది. సాధారణ టిఫిన్, భోజన హోటళ్లు బెల్టు షాపులను తలపిస్తున్నాయి. ధాబాలు మద్యం ప్రియులకు బార్‌లుగా మారాయి. బహిరంగ మద్యంపై గత ప్రభుత్వం ఉక్కుపాదం మోపగా..ఈ ప్రభుత్వం డోర్లు బార్లా తెరిచింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతోంది. స్వయానా తెలుగుదేశం పార్టీ నాయకులే హోటళ్లలో, ధాబాల్లో మద్యం తాగిస్తున్నారు. ఇటీవలి కాలంలో మద్యం సంబంధిత గొడవలు, కేసులు పెరిగినట్టు తెలుస్తోంది. కొన్నిచోట్ల సెబ్ పోలీసులే చిన్న చిన్న హోటళ్లలో తాగిస్తూ కమీషన్లు తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఎక్సైజ్ అధికారులు బార్‌ల నుంచి మామూళ్లు తీసుకోవడం మినహా అవి ఏటైముకు తెరుస్తున్నారు, ఎప్పుడు మూస్తున్నారు అన్నది విస్మరించారు.

నెలలో 11.91 లక్షల లీటర్లు తాగేశారు

గడిచిన నాలుగు మాసాలతో పోలిస్తే జూలై మాసంలో అత్యధికంగా మద్యం వినియోగం అయినట్టు తాజా గణాంకాల్లో వెల్లడైంది. ఒక కేస్‌కు 9 లీటర్ల మద్యం ప్యాక్ అవుతుంది. ఈ లెక్కన 1.32 లక్షల కేస్‌ల మందు తాగారు. దీన్ని బట్టి చూస్తే 11,91,762 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను సేవించినట్టు వెల్లడైంది. దీంతో పాటు 5.12 లక్షల బీర్లు గుటుక్కుమనిపించారు. వాస్తవానికి వేసవిలో ఎక్కువ బీర్లు అమ్ముడవతాయి. అలాంటిది జూలై మాసంలో బీర్ల అమ్మకాలు భారీగా జరిగినట్టు తెలుస్తోంది.

బార్లలో తాగిన మద్యం అదనం

పైన పేర్కొన్నది సర్కారు షాపుల్లో అమ్మిన మద్యం మాత్రమే. ఇది కాకుండా బార్లలో అమ్మిన మద్యం అదనం. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో 22 వరకు బార్లు ఉన్నాయి. వీటిల్లో జూలై నెలలో రూ.4 కోట్ల విలువైన మద్యం వినియోగం జరిగి ఉంటుందని అంచనా. హోటళ్లు, ధాబాలు బెల్టు షాపులను తలపిస్తూ ఉండటమే మద్యం వినియోగం పెరగడానికి కారణమని సామాన్యులు భావిస్తున్నారు. ఇక అక్టోబర్ 1 నుంచి కొత్త మద్యం పాలసీ వస్తుందని, ప్రైవేటు షాపులు వస్తాయని చర్చ జరుగుతోంది. ఇదే జరిగితే మళ్లీ అధికారిక బెల్టు షాపులు నిర్వహించే అవకాశం లేకపోలేదని పలువురు భావిస్తున్నారు.

కరుణించిన వరుణుడు

- పది మండలాల్లో పదును వర్షం

అనంతపురం అగ్రికల్చర్: వరుణుడు కాస్తంత కరుణించాడు. అల్పపీడన ద్రోణి రూపంలో అక్కడక్కడ వర్షాలు కురిపించాడు. జూన్ 14 తర్వాత జిల్లాలో ఎక్కడా ఒక్క పదునైన వర్షం కురవలేదు. అయితే గత రెండు రోజులుగా అక్కడక్కడా మోస్తరు వర్షపాతం నమోదైంది. ప్రధానంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు బెళుగుప్ప 59.8 మి.మీ, విడపనకల్లు 58.2, యాడికి 36.2, యల్లనూరు 36.2, పెద్దవడుగూరు 26.2, కణేకల్లు 20 మి.మీతో పాటు గుత్తి, పుట్లూరు, అనంతపురం, బుక్కరాయసముద్రం తదితర 10 మండలాల్లో పదును వర్షం కురిసింది. మరో ఐదారు మండలాల్లో మోస్తరు వర్షం పడింది.

28 వేల క్వింటాళ్లతో ప్రతిపాదన

వర్షాలు లేక ఖరీఫ్ ప్రధాన పంటల సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోవడంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు వీలుగా 28 వేల క్వింటాళ్లతో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి, కమిషనరేట్‌కు ఇటీవల కంటింజెంట్ ప్లాన్ కింద ప్రతిపాదనలు పంపారు. అందులో అత్యధికంగా ఉలవలు 21,791 క్వింటాళ్లు, అలసందలు 3,252 క్వింటాళ్లు, పెసలు 1,501 క్వింటాళ్లు, జొన్నలు 973 క్వింటాళ్లు, కొర్రలు 369 క్వింటాళ్లు, మినుములు 20 క్వింటాళ్లు అవసరమని నివేదించారు. వర్షాలు వస్తే ఆగస్టు, సెప్టెంబర్‌లో భూములు ఖాళీగా పెట్టుకోకుండా ఇలాంటి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని శాస్త్రవేత్తలు, అధికారులు సూచనలు చేశారు. కానీ కూటమి సర్కారు నుంచి కర్షకులపై కరుణ చూపే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులు నేపథ్యంలో ప్రత్యామ్నాయ విత్తనాలు ఉచితంగా లేదంటే 80 శాతం రాయితీతో వెంటనే అందించాలని రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అంతేకాకుండా అన్నదాతా సుఖీభవ పెట్టుబడి సాయం, పంటల బీమా కింద పరిహారం వెంటనే జమ చేయాలన్న డిమాండ్ అధికమవుతోంది.



ముస్లింలపై రు‘బాబు’

ముస్లింల ద్రోహి టీడీపీ

- వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతివ్వడంపై భగ్గుమన్న ముస్లింలు
- బిల్లును వ్యతిరేకించి అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీకి కృతజ్ఞతలు

చంద్రబాబు ముసుగు తొలగింది. ముస్లింలకు అండగా ఉంటానన్న ఆయన మాటలు నీటిపై రాతలేనని పార్లమెంట్ సాక్షిగా రుజువైంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు ఏకపక్షంగా మద్దతివ్వడంతో బాబు నిజస్వరూపం బట్టబయలైంది. పదేళ్లుగా లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీతో జత కూడినప్పుడే బాబు తీరుపై ముస్లింలలో అనుమానం కలిగింది. తాజాగా వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం తెలపడంతో ఆ అనుమానం నిజమైంది. బాబు కూడా ఆ తాను ముక్కేనని.. తాను నడిచేది ‘కాషాయ’ ఛాయల్లోనేనని తెలిసిపోయింది.

అనంతపురం/ అనంతపురం కల్చరల్ : కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ ఏకపక్షంగా మద్దతివ్వడంపై ముస్లింలు భగ్గుమంటున్నారు. ముస్లింలకు తోడుగా ఉంటానంటూనే మోదీకి తోడై .. తోడేళ్ల పన్నాగం పన్నుతావా అంటూ ధ్వజమెత్తుతున్నారు. వక్ఫ్ ఆస్తులకు రక్షణగా ఉంటామంటూనే ‘ఉఫ్’మని లాగేసేందుకు నక్కజిత్తుల ఎత్తులేస్తున్నావా అంటూ మండిపడుతున్నారు. మరోవైపు పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకించడంతో ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్ ఎప్పుడూ ముస్లింల పక్షపాతేనని కొనియాడుతున్నారు. వక్ఫ్ సవరణ బిల్లును పూర్తిగా ఆపేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. మైనార్టీలకు ఏ కష్టమొచ్చినా.. ఏ నష్టం జరిగినా అండగా ఉంటామంటూ చెప్పిన టీడీపీ, జనసేన పార్టీలు ఇప్పుడెలా మద్దతిస్తాయని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడైనా రెండు నాల్కల ధోరణిని మానుకోవాలని హితవు పలుకుతున్నారు.




అజమాయిషీ కోసం కుట్ర



వక్ఫ్ ఆస్తులపై కేంద్ర ప్రభుత్వం అజమాయిషీ చేయాలని కుట్ర పన్నింది. అందుకే వక్ఫ్ బిల్లు సవరణ చేయాలనుకుంది. దేశంలో ఉన్న మెజార్టీ పార్టీలు దీన్ని వ్యతిరేకిస్తుంటే బీజేపీ పెట్టిన బిల్లుకు టీడీపీ అనుకూలంగా ఉండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బిల్లు సవరణతో మసీదు, దర్గాలకు చెందిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొంటే ఆ తర్వాత వాటి నిర్వహణ కోసం అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ బిల్లును ఎప్పటికీ ప్రవేశపెట్ట కూడదు. దీన్ని మేమంతా వ్యతిరేకిస్తున్నాం.

– పి.నబీషా, కణేకల్లు వైస్ సర్పంచ్

ముస్లింల హక్కులు హరించడమే



గతంలో వక్ఫ్‌బోర్డుకు ఆస్తులు అప్పగించేవారు. దేశంలో 9.5 లక్షల ఎకరాల భూములు వక్ఫ్‌బోర్డు పరిధిలో ఉన్నాయి. వక్ఫ్‌బోర్డు ఆస్తులు పవిత్రంగా భావిస్తారు. ఇటువంటి ఆస్తులను పరిరక్షించి, అభివృద్ధి చేయాల్సింది పోయి బీజేపీ ప్రభుత్వం, టీడీపీ, జనసేన పార్టీలు ఈ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు. వక్ఫ్‌బోర్డు చట్టాలు, అధికారాలను తగ్గించి కలెక్టర్ కిందకు తీసుకొస్తున్నారు. వక్ఫ్‌బోర్డులోకి ఇతర మతస్తులనూ తీసుకు వస్తున్నారు. ఇందుకు ముస్లిం సమాజం ఒప్పుకోదు. వైఎస్సార్‌సీపీ ఈ బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడి లోక్‌సభలో నిలదీయడంతో ముస్లిం సమాజం హర్షం వ్యక్తం చేస్తోంది.

– కాగజ్‌ఘర్ రిజ్వాన్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్, అనంతపురం

బీజేపీ విధానాలు మంచివి కావు



తొలి నుంచి బీజేపీ నాయకులు ముస్లింలను శత్రువులుగానో, ద్వితీయ జాతి పౌరులుగానో చూస్తున్నారనడానికి క్రమంగా వారు తెస్తున్న కొత్త చట్టాలు, విధానాలే నిదర్శనం. వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం అందరం పరిశ్రమిస్తుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇంకా లాగేసుకునే ప్రయత్నం చేస్తుండడం దురదృష్టకరం.

– డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్, ముతవల్లి, మస్జిద్ ఏ మహ్మదియా, అనంతపురం

టీడీపీ మద్దతివ్వడం సిగ్గుచేటు



ఎన్డీయే ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో సవరణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికే బిల్లును ప్రవేశపెట్టినట్లు అర్థమవుతోంది. ముస్లింల హక్కులను కాలరాసే అధికారం మీకెవరిచ్చారు? వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు తెలపడం సిగ్గుచేటు. ముస్లిం మైనార్టీల ఓట్లతో గద్దెనెక్కిన ఎన్డీయే సర్కార్ దుర్మార్గపు ఆలోచనలను విరమించుకోవాలి. వక్ఫ్ బిల్లును వ్యతిరేకించిన వైఎస్సార్‌సీపీ, ఇతర పార్టీలకు ముస్లింలు కృతజ్ఞతగా ఉంటారు.

– సి.చాంద్‌బాషా, 29వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్, గుంతకల్లు

సవరణ బిల్లు రాజ్యాంగ ఉల్లంఘనే



వక్ఫ్ నిబంధనల్లో సవరణలు చేయడం రాజ్యాంగ ఉల్లంఘనే. వక్ఫ్ బోర్డు భూములు గ్రామాల్లోను, పట్టణాల్లోను ఎంతో విలువైనవని, వాటిని అక్రమించుకోవడానికే ఈ సవరణ బిల్లు తెచ్చారు. ముస్లింల మనోభావాలు దెబ్బతీస్తున్నారు. వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించడం చాలా సంతోషం. ముస్లింల మనోభావాలు అర్థం చేసుకున్నారు.

– ఖాదర్‌వలి ఖాన్, మాజీ సర్పంచ్, నార్పల

మౌలిక సూత్రాలకు వ్యతిరేకం



బీజేపీ తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలకే విరుద్ధం. మసీదులకు, దర్గాలకు ఇన్నాళ్లుగా రక్షణగా నిలిచిన చట్టాలను ఇష్టారాజ్యంగా పెన్నుపోటుతో మార్చేస్తామంటే కుదరదు. కొందరు స్వార్థపరులు మద్దతిచ్చినంత మాత్రాన దేశ ప్రజలందరూ బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారన్న సత్యాన్ని ఇప్పటికైనా పాలకులు తెలుసుకోవాలి. మైనార్టీల హక్కులను రక్షించుకోవడం అందరి బాధ్యత. ముస్లింలకు సహకరిస్తున్న వైఎస్సార్‌సీపీకి కృతజ్ఞతలు.

– మక్బూల్, మైనార్టీ నాయకులు, అనంతపురం

ముస్లింలకు ద్రోహం చేయడమే



పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు ఇవ్వడం ముస్లింలకు ద్రోహం చేయడమే. వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్ సీపీ వ్యతిరేకించడం హర్షించదగ్గ, అభినందించదగ్గ విషయం. ముస్లింల పక్షపాతి ఎవరో.. ద్రోహి ఎవరో తేటతెల్లమైంది.

– జీఎం బాషా, సున్నీ రోషన్ మసీద్ ప్రెసిడెంట్, గుత్తి ఆర్‌ఎస్

వక్ఫ్ ఆస్తులు రక్షించుకుందాం



చాలామంది స్వార్థపరుల వల్ల వక్ఫ్‌బోర్డు ఆస్తులు ఇప్పటికే అన్యాక్రాంతమైపోతున్నాయి. దీనిని కాపాడలేకపోగా బీజేపీ ప్రభుత్వం ముస్లింలను ప్రత్యర్థులుగా చూస్తూ అవమానిస్తోంది. బీజేపీ వినాశకర విధానాలను మైనార్టీ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పారదర్శకత ముసుగులో మాకు వ్యతిరేకంగా ఉండే బిల్లును వెంటనే వెనక్కు తీసుకోవాలన్నదే మా ప్రధాన డిమాండ్.

– మహబూబ్ బాషా, రాష్ట్ర అధ్యక్షులు, ఐఎంఎం

క్లుప్తంగా

అడవుల సంరక్షణకు పటిష్ట చర్యలు

- కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రిన్సిపల్ చీఫ్ చిరంజీవిచౌదరి



ధర్మపురి ఫారెస్ట్‌లో వన్యప్రాణుల జాడను గుర్తిస్తున్న చిరంజీవిచౌదరి, అధికారులు

రాయదుర్గం: జంతు పరిరక్షణ, అడవుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రిన్సిపల్ చీఫ్ చిరంజీవిచౌదరి తెలిపారు. శుక్రవారం రాయదుర్గానికి వచ్చిన ఆయన నగర వనం, ధర్మపురి అటవీప్రాంతాల్లో నాటిన మొక్కల పెంపకాన్ని సీసీఎఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ వినీత్‌కుమార్, విజిలెన్స్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయదుర్గం, కళ్యాణదుర్గం, పంపనూరు నగర వనాలను రూ.6 కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల హెక్టార్లలో 1.10 కోట్ల మొక్కలు నాటాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే 80 శాతానికి పైగా మీ ప్రక్రియ పూర్తియిందన్నారు. 50 రెవెన్యూ డివిజన్ల పరిధిలో రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ జరిగిందన్నారు. అడవుల వినాశనాన్ని కోరుకుంటే కఠిన చర్యలు చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్లు మధుబాబు, వెంకటరమణారెడ్డి, డీఆర్వోలు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రాజ్యోన్మాదంపై ప్రజాగ్రహం

- అంబేడ్కర్ విగ్రహంపై పచ్చమూకల చీకటిదాడిని ఖండించిన యావత్ ప్రజానీకం
- దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



సాక్షి నెట్‌వర్క్ : విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై గురువారం రాత్రి పచ్చమూకల చీకటిదాడిని ప్రజాసంఘాల నేతలు, ప్రజలు ముక్తకంఠంతో ఖండించారు. రాజ్యోన్మాదం కారణంగా ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందంటూ మండిపడ్డారు. ప్రభుత్వమే పూనుకుని రాజ్యాంగ నిర్మాతపై దాడికి ప్రేరేపించడం దేశచరిత్రలోనే కనీవినీ ఎరుగని దారుణమని పేర్కొన్నారు.

దళిత జాతిని అగౌరవపరిచారు



విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం అమానుషం. ఇది యావత్ దళిత జాతిని అగౌరవ పరచడమే. అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగంగా మాజీ సీఎం వైఎస్ జగన్ ఆ మహానుభావుడి మహాశిల్పాన్ని విజయవాడ నడిబొడ్డులో ఏర్పాటు చేశారు. ఇంతటి అపూర్వమైన శిల్పాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలి.

–రంగనాయకులు, దళిత సంఘం నాయకుడు, పి.కొండాపురం, పామిడి మండలం

దిగజారుడు రాజకీయాలు



అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడి టీడీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. ఇచ్చిన హామీలు తుంగలోకి తొక్కి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన భవనాలు, విగ్రహాలను పగులగొట్టడం వంటి పనులు చేస్తూ నీచ రాజకీయాలు చేస్తున్నారు. టీడీపీ నాయకులు త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

– నీలం భాస్కర్, జెడ్పీటీసీ సభ్యుడు, బుక్కరాయసముద్రం

ప్రజాస్వామ్యంలో ఉన్నామా?



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం వెనుక ఎంతటివారున్నా కఠినంగా శిక్షించాలి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక విగ్రహాలు, మనుషులపై దమనకాండ ఎక్కువైంది. అసలు ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోంది. విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఉన్మాదులను తక్షణం అరెస్టు చేసి జైలుకు పంపాలి. ఈ ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని స్పందించాలి.

– శారద, 19వ వార్డు కౌన్సిలర్, రాయదుర్గం

ఎల్లో గ్యాంగ్‌ను కఠినంగా శిక్షించాలి



విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం హేయమైన చర్య. ఈ ఘటనతో యావత్ దళిత సమాజం నివ్వెరబోయింది. సాక్షాత్తూ రాజ్యాంగ నిర్మాత విగ్రహంపై పచ్చమూకలు దాడి చేయడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. దళిత జాతికి అవమానకరం. ఈ ఘటనపై రాష్ట్రపతి స్పందించాలి. ఈ దుశ్చర్యకు కారకులైన ఎల్లో గ్యాంగ్‌ను గుర్తించి కఠినంగా శిక్షించాలి. లేకుంటే దళిత జాతి ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది.

– బీటీపీ గోవిందు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, రాయదుర్గం

టీడీపీ అరాచకాలు పెచ్చుమీరాయి



టీడీపీ నేతృత్వంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు పెచ్చుమీరాయి. రాజ్యాంగ నిర్మాతను అవమానపరిచేలా, దళిత, గిరిజన, బహుజనుల మనోభావాలను దెబ్బతీసేలా విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడి చేసిన వారిని గుర్తించి.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. ఈ ఘటనకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సమాధానం చెప్పాలి.

–సాకే గంగాధర్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి

దళిత జాతికే అవమానం



అంబేడ్కర్ విగ్రహంపై దాడి దళిత జాతికే అవమానం. ఎన్నడూ లేని విధంగా విగ్రహాలపై దాడులు చేయడం సిగ్గుచేటు. అధికారుల సమక్షంలోనే ఇలాంటి చర్యలకు పూనుకోవడం హేయమైన చర్య. పోలీసులు ఉన్నా ప్రేక్షక పాత్ర పోషించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

– చెలిమప్ప, ఎస్సీ,ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు, కళ్యాణదుర్గం

రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది



విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై దాడి టీడీపీ కార్యకర్తల పనే. సీఎం చంద్రబాబుకు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంపై ఏమాత్రమూ నమ్మకం లేదనే విషయం ఈ దుశ్చర్యతో బయట పడింది. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ.. ఇలాంటి ఘటనలను ప్రోత్సహిస్తున్నారు.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

నీచమైన చర్య



రాష్ట్రంలో నీచమైన సంస్కృతికి కూటమి ప్రభుత్వం తెర తీస్తోంది. విజయవాడ నడిబొడ్డున గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాశిల్పంపై దాడికి పాల్పడిన టీడీపీ మూకలను కఠినంగా శిక్షించాలి.

–టైలర్ వన్నూరుస్వామి, ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు

34 మంది ఎంపీడీఓల రిలీవ్

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 మంది ఎంపీడీఓలు శుక్రవారం రాత్రి 9 గంటలకు రిలీవ్ అయ్యారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి సొంత జిల్లాలకు బదిలీపై వెళ్లారు.

లత్తవరంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా ఉపసర్పంచ్ మార్పు
- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సర్పంచ్ పాలడగు వంశీ



ఎంపీడీఓ సుబ్బరాజుకు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్ పాలడగు వంశీ, బోయ నాగమ్మ

ఉరవకొండ: మండలంలోని లత్తవరం గ్రామంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అధికారులు అమలు చేశారు. ముందస్తు సమాచారం లేకుండా ఏకంగా ఉపసర్పంచ్‌ను మార్చేసి టీడీపీ మద్దతుదారుకు ఆ పదవిని కట్టబెట్టారు. దీనిపై సర్పంచ్ పాలడగు వంశీ మండిపడ్డారు. సభ్యుల ఆమోదం లేకుండా ఉప సర్పంచ్‌ను ఎలా మారుస్తారంటూ శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను ఆయన నిలదీశారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం తగదని హితవు పలికారు. 'ఇక్కడేమైనా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందా సార్... ' అంటూ ధ్వజమెత్తారు. కాగా, ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే జూలై 26న ఉప సర్పంచ్ బోయ నాగమ్మను మార్చి ఆ స్థానాన్ని టీడీపీ మద్దతుతో గెలిచిన వంకలపాటి లక్ష్మికి కట్టబెట్టారు. మూడో వ్యక్తికి తెలియకుండా జరిగిన ఈ కుట్రలో స్థానిక టీడీపీ నాయకులతో ఈఓఆర్డీ చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి ఆషీర్‌బాబు, లత్తవరం తండా పంచాయతీకి చెందిన రాఘవేంద్ర... ములాఖత్ అయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఉపసర్పంచ్‌గా నాగమ్మ పేరు కాకుండా వంకలపాటి లక్ష్మి పేరును అధికారులు పిలవడంతో సభ్యులందరూ ఒక్కసారిగా అవాక్కయ్యారు. సర్పంచ్ పాలడగు వంశీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా, సభ్యులకు తెలపకుండా ఉపసర్పంచ్‌ను ఎలా మారుస్తారంటూ ఎంపీడీఓ సుబ్బరాజును నిలదీశారు. టీడీపీ నాయకుల బెదిరింపులకు భయపడి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా లత్తవరం పంచాయతీలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తామంటే ఒప్పుకోబోమన్నారు. పంచాయతీ రాజ్ చట్టానికి విఘాతం కలిగిస్తూ తప్పుడు నిర్ణయాలు ఎలా తీసుకుంటారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ మాటే చెల్లుబాటు కావాలన్న ధోరణితో టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఉప సరంచ్ పదవికి రాజీనామా చేయాలంటూ బోయ నాగమ్మపై దౌర్జన్యం చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. అనంతరం తప్పుడు నిర్ణయాలతో ఉపసర్పంచ్‌ను మార్చిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ బోయ నాగమ్మతో కలసి ఎంపీడీఓ సుబ్బరాజుకు వినతిపత్రం అందించారు. దీనిపై ఎంపీడీఓ మాట్లాడుతూ... ఈ అంశం తన దృష్టికి వచ్చిందని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు.

అనుమతి రాగానే అదనపు సీట్ల భర్తీ

- సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అదనపు సీట్లకు అనుమతి రాగానే భర్తీ చేస్తామని కో–ఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గురుకులాలకు ఉన్న ప్రాధాన్యత, డిమాండ్ దృష్ట్యా రెండు జిల్లాల కలెక్టర్ల చొరవతో గురుకులాల్లో తరగతి గదులు, డార్మిటరీ సౌకర్యాలు ఉండే చోట 5 నుంచి 8 తరగతుల్లో ఒక్కో తరగతికి 10 సీట్లు పెంచేలా సెక్రటరీకి లేఖ రాశామన్నారు. అనుమతి వచ్చిన వెంటనే వాటికి కూడా ప్రవేశ పరీక్ష ద్వారానే మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తామన్నారు. మూడు కౌన్సిలింగ్‌ల తర్వాత కూడా మిగిలి ఉన్న సీట్లను కలెక్టర్ అనుమతితోనే భర్తీ చేసినట్లు స్పష్టం చేశారు. సీట్ల భర్తీలో ఏదైనా అవకతవకలు జరిగాయని భావిస్తే రుజువులతో నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. తప్పుడు ప్రచారాలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.92.64 కోట్ల బకాయిలు ఇప్పించండి

- కలెక్టర్‌ను కోరిన జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్, చిత్రంలో గిరిజమ్మ

అనంతపురం అర్బన్: జిల్లాపరిషత్‌కు మున్సిపాలిటీల నుంచి రూ.92.64 కోట్ల మేర నీటి చార్జీల బకాయిలు పేరుకుపోయాయని ఈ మొత్తం వసూలైతే జిల్లాలో నీటి సమస్యల పరిష్కారానికి ఉపయోగించుకునేందుకు వీలవుతుందని కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తీసుకొచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శ్రీసత్యసాయి నీటి సరఫరా బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గిరిజమ్మ మాట్లాడుతూ.. మున్సిపాలిటీల నుంచి అందాల్సిన బకాయిలపై గడిచిన రెండు సర్వసభ్యసమావేశాల్లోనూ సభ్యులు ప్రస్తావించారని తెలిపారు. బకాయిలు చెల్లించేలా చొరవ తీసుకోవాలని కమిషనర్లను సమావేశ పరిచి సూచించినట్లు గుర్తు చేశారు. అయినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. బకాయిలు వసూలైతే ఆ నిధులతో నీటి సరఫరా విభాగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ అంశంలో చొరవ తీసుకుని చెల్లింపులు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం నీటి సరఫరా సమస్యలు, కార్మికుల వేతనాలు తదితర అంశాలపై చర్చించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, నీటిపారుదల శాఖ ఎస్ఈ రాజశేఖర్, డీపీఓ ప్రభాకర్, ప్రజారోగ్యశాఖ సతీష్ చంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాల నిర్మాణానికి చర్యలు



పాఠశాల స్థలం వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సిద్దరాంపురం రోడ్డు సమీపంలో గిరిజన గురుకుల పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు కలెక్టర వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బీకేఎస్‌లోని ఎస్టీ హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. రికార్డులు, తరగతి భవనాలు, వంట గది, మరుగు దొడ్లను పరిశీలించారు. హాస్టల్‌లో పిల్లల సంఖ్యపై ఆరా తీశారు. పిల్లల విద్యాభ్యాస నైపుణ్యాలను పరిశీలించారు. అనంతరం సిద్దరాంపురం రోడ్డు సమీపంలో ఎంపిక చేసిన 5 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుణ్యవతి, ప్రిన్సిపాల్ హర్జేనాయక్, వార్డెన్ బయపరెడ్డి, మండల సర్వేయర్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ స్థానాల్లో పనిచేయలేం సార్..

- కలెక్టర్‌తో మొరపెట్టుకునేందుకు సిద్ధమైన ఏడుగురు తహసీల్దార్లు

అనంతపురం అర్బన్: పోస్టింగ్ ఇస్తూ స్థానాలను కేటాయించి వారం గడిచినా కొందరు తహసీల్దార్లు విధుల్లోకి చేరలేదు. అధికారపార్టీ నాయకుల తీరు కారణంగా కొందరు... వ్యక్తిగత కారణాలతో మరికొందరు జాయిన్ కాలేదని తెలిసింది. దీంతో వీరందరికి స్థానాల మార్పుపై జిల్లా రెవెన్యూ అధికారులు మరోసారి కసరత్తు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు గత నెల తిరిగి జిల్లాకు వచ్చారు. ఈ క్రమంలో 40 మంది తహసీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఈ నెల 2న ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణం విధుల్లో చేరాలని పేర్కొన్నారు. వారం రోజులు గడిచినా... ఏడుగురు తహసీల్దార్లు వివిధ కారణాలతో కేటాయించిన స్థానాల్లో జాయిన్ కాలేదు. విధుల్లోకి చేరని వారిలో అనంతపురం రూరల్, కూడేరు, బెళుగుప్ప, తాడిపత్రి, పెద్దవడుగూరు మండలాలు కేటాయించిన వారు ఉన్నారు. అలాగే కలెక్టర్ కార్యాలయానికి పోస్టింగ్ ఇచ్చిన ఇద్దరు తహసీల్దార్లూ విధుల్లో చేరలేదని సమాచారం. దీంతో విధుల్లోకి చేరని తహసీల్దార్లకు కలెక్టర్ నుంచి పిలుపు అందినట్లు తెలిసింది. ఎందు చేత విధుల్లోకి చేరలేదు అనే దానిపై వారి ద్వారానే తెలుసుకునేందుకు పిలిపించినట్లు సమాచారం.

'నిరుద్యోగ భృతికి ఆంక్షలా?'



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు

అనంతపురం అర్బన్: నిరుద్యోగ భృతి విషయంలో కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు ఖండించారు. ఎన్నికలకు ముందు ఈ ఆంక్షలు చెప్పకుండా అధికారం చేపట్టిన తర్వాత ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఎలాంటి షరతులు లేకుండా 45 ఏళ్ల వయస్సు వరకూ నిరుద్యోగులందరికీ భృతి చెల్లించి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. అనంతపురంలోని ఆ శాఖ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా సమితి సమావేశం జరిగింది. లెనిన్‌బాబుతో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పాల్గొన్నారు. లెనిన్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగ ఖాళీలపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసి, వాటి భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితి 45 ఏళ్లు ఇవ్వాలని కోరారు. పాఠశాలల్లో పీఈటీ పోస్టులు పునరుద్ధరించాలన్నారు. ప్రస్తుతం ప్రకటించిన డీఎస్సీ పోస్టుల్లో ఎస్జీటీ పోస్టులు తక్కువగా ఉన్నాయని, వీటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ వస్తున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.... నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 3 నుంచి 5వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో నాయకులు మోహన్‌కృష్ణ, రాము, ధనుంజయ, శ్రీనివాసులు, చాంద్‌బాషా, రాంబాబు, ఏఐఎస్ఎఫ్ కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సీఐల బదిలీ

అనంతపురం: అనంతపురం రేంజ్ పరిధిలో పులువురు సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీఐజీ డాక్టర్ షిమోషి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
బి.శేఖర్	వీఆర్, అనంతపురం	గోరంట్ల
కె.శాంతిలాల్	వీఆర్, రేంజ్ ఆఫీస్ అనంతపురం	అనంతపురం త్రీటౌన్
ధరణి కిశోర్	త్రీటౌన్, అనంతపురం	డీఎస్‌బీ, అనంతపురం
జె.హేమంత్‌కుమార్	సోషల్‌మీడియా/సైబర్‌సెల్, పుట్టపర్తి	ఇటుకలపల్లి
వై. నరేంద్రరెడ్డి	ఇటుకలపల్లి	వీఆర్, అనంతపురం
టీవీ శ్రీ హర్ష	డీసీఆర్‌బీ, పుట్టపర్తి	రాప్తాడు
డి.మునిస్వామి	రాప్తాడు	వీఆర్, అనంతపురం
కె.సాయినాథ్	వీఆర్, అనంతపురం	ఫోర్త్‌టౌన్, అనంతపురం
ఆర్.ప్రతాప్‌రెడ్డి	ఫోర్త్‌టౌన్, అనంతపురం	వీఆర్, అనంతపురం
కె.రఘుప్రసాద్	సెబ్, అనంతపురం	అనంతపురం ట్రాఫిక్
డీవీ నారాయణ రెడ్డి	అనంతపురం ట్రాఫిక్	కదిరి టౌన్
వి.శ్రీధర్	శింగనమల	బీకేఎస్
జి.వెంకటేశ్వర్లు	బీకేఎస్	వీఆర్ ఎస్పీ, అనంతపురం
జి.రాజేంద్రనాథ్	నల్లమాడ	కళ్యాణదుర్గం రూరల్
పి.చంద్రశేఖర్	కళ్యాణదుర్గం రూరల్	వీఆర్ ఎస్పీ, అనంతపురం
సి.నీలకంఠేశ్వర్	ఇంటెలిజెన్స్, అనంతపురం	కళ్యాణదుర్గం రూరల్
ఎన్.వి.నాగరాజు	కళ్యాణదుర్గం రూరల్	వీఆర్‌ఎస్పీ, అనంతపురం
ఎంపీ ఇందిర	డీఎస్‌బీ, అనంతపురం	కొత్తచెరువు
పి.జగన్‌మోహన్‌రెడ్డి	డీటీసీ, తిరుపతి	వీఆర్‌ఎస్పీ, అనంతపురం
కె.జనార్దన్	సీసీఎస్, అనంతపురం	హిందూపురం రూరల్

క్లుప్తంగా

రేపు 'రెడ్డి ఉచిత వివాహ పరిచయ వేదిక'

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11న ఉదయం 10:30 నుంచి 1 గంటల వరకు 'రెడ్డి ఉచిత వివాహ పరిచయ వేదిక' ఏర్పాటు చేసున్నారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేట (కళ్యాణదుర్గం రోడ్డు బీఎస్ఎన్ఎల్ టవర్ వెనుక) నిర్వహించే ఈ కార్యక్రమంలో రెడ్డి కుటుంబాల యువతీ, యువకులు వారి జీవిత భాగస్వామిని ఎంచుకునేందుకు మంచి అవకాశం కల్పిస్తున్నట్లు రాయలసీమ రెడ్డి జన సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి, కార్యదర్శి కిషోర్‌రెడ్డి, తోపుదుర్తి రామకృష్ణారెడ్డి, మంత్రి విశ్వనాథరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాబోయే నూతన వధూవరుల బయోడేటా, ఫొటోలు తప్పకుండా తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 93902 84296, 94907 67224, 99842 38044 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి



ఈ-క్రాప్ బుకింగ్ అనంతరం వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ సుచరిత

ఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుచరిత తెలిపారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో ఈ-క్రాప్ బుకింగ్‌ను పర్యవేక్షించారు. అనంతరం వేరుశనగ పంటను పరిశీలించారు. పంటలు సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఈ-క్రాప్ చేయించుకుంటేనే పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం పాములాయి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద గురువారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. 44వ జాతీయ రహదారిని దాటుతున్న సమయంలో వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లుగా సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. మృతుడికి దాదాపు 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయసుఉంటుందన్నారు. మిస్సింగ్ కేసుల్లో సంబంధీకులు ఎవరైనా ఉంటే 94407 96811లో సంప్రదించాలని కోరారు.

ఆగని తమ్ముళ్ల ఇసుక దందా



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

శింగనమల: మండలంలో టీడీపీ నాయకుల ఇసుక అక్రమ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. మండలంలోని ఇరువెందల సమీపంలోని నదీ పరివాహక ప్రాంతంలో కొందరు టీడీపీ నాయకులు జేసీబీ పెట్టి, టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు... వాహనాలను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినా వారిలో మార్పు రాలేదు. దీంతో స్థానికులు నేరుగా ఫోన్ ద్వారా ఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున రంగంలో దిగి రెండు టిప్పర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

'అమూల్' సేవలను నిలిపి వేయడం దుర్మార్గం



మూతబడిన ఏపీ డెయిరీని పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: ప్రైవేట్ డెయిరీల కన్నా అధిక ధరలు చెల్లిస్తూ పాడి రైతులకు విశిష్ట సేవలు అందిస్తున్న అమూల్ పాల సేకరణను ఈ నెల 11 నుంచి మూసివేయనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమని ఏపీ రైతు సంఘం నాయకులు మండిపడ్డారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, అమూల్ సంస్థ సహకార సంఘాలకు చెందిన మహిళా సభ్యులు సంయుక్తంగా శుక్రవారం ఉదయం అనంతపురంలో మూతబడిన ఏపీ డెయిరీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాడి రైతులకు రుణాలు ఇప్పించడంతో పాటు మహిళా సంఘాల ద్వారా పాలసేకరణతో లీటర్‌పై రూ.5 నుంచి రూ.20 వరకు అదనపు ధర చెల్లిస్తున్న అమూల్ సంస్థను మూసివేసే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రోజుకు 16 వేల లీటర్లు సేకరిస్తున్న అమూల్ సంస్థ మూతబడితే ఇతర ప్రైవేట్ డెయిరీలు ధరలు తగ్గించి పాడి రైతులను మోసం చేస్తాయన్నారు. అనంతరం ఏపీ డెయిరీ అధికారులు ప్రభాకరరెడ్డి, నారాయణమ్మకు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు నాగరాజు, రాజు, మాధవి, రాప్తాడు కృష్ణవేణి, అరుణమ్మ,సోమలింగారెడ్డి, కేశవరెడ్డి, సుబ్బరహరి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.



పంపనూరు వద్ద వరి నాట్లు వేస్తున్న మహిళలు



నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న వరి నారు

జోరుగా వరి నాట్లు

ఆత్మకూరు మండల వ్యాప్తంగా వరి నాట్లు జోరందుకున్నాయి. నీటి వసతి కలిగిన రైతులు వరిసాగులో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ట్రాక్టర్లు, ఎద్దుల ద్వారా దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు వరి నారు, రసాయన మందులు సేకరించడంలో బిజీ అయ్యారు. ఆత్మకూరు, సింగంపల్లి, వై.కొత్తపల్లి, మదిగుబ్బ, సనప, తోపుదుర్తి గ్రామాల్లో ఎక్కువగా వరి సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం బియ్యం ధరలు పెరగడంతో అధిక శాతం రైతులు వరి వైపే మొగ్గు చూపుతున్నారు. ఈసారి వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే మంచి దిగుబడులు రావొచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

– ఆత్మకూరు:



ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు

మొక్కలను సంరక్షించేలా చర్యలు



నగరంలోని 25వ డివిజన్ పరిధిలో మొక్కలు నాటిన మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 24, 25వ డివిజన్ల పరిధిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కోవిడ్ విపత్తు ఆక్సిజన్ అవశ్యకతను మానవాళికి తెలియజేసిందన్నారు. ఉచితంగా లభించే ఆక్సిజన్ డబ్బు చెల్లించినా.. దొరకని పరిస్థితిని కరోనా విపత్తులో చూశామన్నారు. భవిష్యత్తరాలకు ఆ పరిస్థితి ఉత్పన్నం కాకుండా ఉండాలంటే మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నగర ప్రజలు సైతం సామాజిక బాధ్యతగా మొక్కలను విరివిగా నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు. నగరపాలక సంస్థ పాలకవర్గం ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు విరివిగా నాటేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, ఏడీఏ లక్ష్మీప్రసన్న, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు వెంకటరామి రెడ్డి, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఎల్ఐ సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించిన ఏపీజీఎల్ఐ సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు.శుక్రవారం ఏపీజీఎల్ఐసీ కార్యాలయ సూపరింటెండెంట్ కుళ్లాయప్పను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగమయ్య మాట్లాడుతూ.. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవిత బీమా పాలసీదారులకు సంబంధించిన పాలసీ వివరాలు అప్డేషన్ లేక, పాలసీదారులు ఎన్‌హాన్స్‌మెంట్ చేసిన మొత్తాలకు సంబంధించిన పాలసీ బాండ్లు జారీ కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిపై ఎలాంటి సమాచారం అందక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని వాపోయారు. ఇటీవల రిటైర్డ్ అయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన పాలసీ మొత్తాలు సకాలంలో అందలేదన్నారు. గడువు పూర్తయినా ఫైనల్ చెల్లింపులు జరగడం లేదన్నారు. చనిపోయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన పాలసీ సొమ్ము సకాలంలో చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బారాయుడు, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, బీకే నారాయణ, శ్రీనివాసులు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన నేత బుద్ధదేవ్



బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అనంతపురం అర్బన్: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య రాజకీయ విలువలు, నిబద్ధత కలిగిన నేత అని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. ఆయన మృతి సీపీఎం పార్టీకి తీరని లోటన్నారు. శుక్రవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో బుద్ధదేవ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. బుద్ధదేవ్ సీపీఎం పార్టీలో నిబద్ధత గల కార్యకర్తగా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. వామపక్ష సంఘటన ప్రభుత్వంలో మూడు దశాబ్దాల పాటు మంత్రిగా, 11 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేశారని పేర్కొన్నారు. అంకితభావం కలిగిన కమ్యూనిస్టుగా బుద్ధదేవ్ నిరాడంబరమైన జీవితం కొనసాగించారన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రతి కార్యకర్త ప్రజాక్షేత్రంలో పని చేయాలన్నారు. కార్యాలయ ఇన్‌చార్జి టి.సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు నాగమణి, చంద్రశేఖర్‌రెడ్డి, రామిరెడ్డి, వెంకటనారాయణ, ప్రకాష్, శివ, చంద్ర, వన్నూరప్ప, సునంద, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ రిజిస్ట్రేషన్‌కు విస్తృత ప్రచారం



కుర్లపల్లిలో డ్రిప్ పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది జిల్లాకు 37,500 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు (బిందు, తుంపర) సేద్యం పరికరాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న నేపథ్యంలో రైతులు సద్వినియోగం చేసుకునేలా ఆటోల ద్వారా ప్రచారం చేపట్టినట్లు ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. బ్రహ్మసముద్రం, బొమ్మనహాల్ మండలాలు మినహా మిగిలిన 29 మండలాల్లోని గ్రామాల్లో ఆటోల ప్రచారం మొదలైందన్నారు. డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, ఎంఐఏఓలు, హార్టికల్చర్ అధికారులు, రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) అసిస్టెంట్ల ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ముమ్మరంగా ప్రచారం చేపట్టాలని నిర్ణయించామన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతూ తక్షణం ఆర్ఎస్‌ఏల్లో అన్ని వివరాలు సమర్పించి రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. సబ్సిడీ, ఇతర మార్గదర్శకాలను అనుసరించి వీరికి సీనియార్టీ వారీగా డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆత్మకూరు: మండలంలోని అర్హులైన రైతులందరూ డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆత్మకూరు మండలంలోని పంపనూరు, వై.కొత్తపల్లి, పి.కొత్తపల్లి, ఆత్మకూరు గ్రామాల్లో పర్యటించి రైతులకు డ్రిప్ పరికరాలపై అవగాహన కల్పిస్తూ అర్హులైన రైతులతో రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో డీసీఓ ఆంజనేయులు, ఎఫ్‌సీఓ ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

సామాజిక న్యాయం పాటించాలి



ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రెక్టార్, రిజిస్ట్రార్ పదవుల నియామకంలో సామాజిక న్యాయం పాటించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితకు వినతిపత్రం అందజేశారు. వర్సిటీలో సీనియర్ ప్రొఫెసర్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల వారికి రిజిస్ట్రార్ పోస్టు కట్టబెట్టకుండా ఒకే సామాజిక వర్గం వారికి కట్టబెట్టడంలో ఆంతర్యమేమిటన్నారు. గత ప్రభుత్వంలో కేవలం ప్రొఫెసర్లకు మాత్రమే రిజిస్ట్రార్ పదవిని అప్పగించారన్నారు. సామాజిక న్యాయాన్ని పాటించాలని ప్రభుత్వ పెద్దలు చెప్పినప్పటికీ మిన్నకుండా ఉంటూ కాలయాప చేస్తున్నారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం పాటించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. సీనియర్ ప్రొఫెసర్లు లేకపోతే డిప్యూటీ రిజిస్ట్రార్ కేటగిరీ వారికి అప్పగించాలి. కానీ ఏకంగా రీసెర్ కమ్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌ను రిజిస్ట్రార్‌ను చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ప్రొఫెసర్లను అవమానించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు తిప్పలూరు సుధీర్ రెడ్డి, పి.హేమంత్ కుమార్, కిరణ్, అనిల్, భాస్కర్, శివ, జయంత్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో మెప్పించాలి



అన్నదానం చేస్తున్న రాగే పరుశురాం తదితరులు

అనంతపురం కల్చరల్: సినీ నటుల అభిమానులు కేవలం సినిమాలను విజయవంతం చేయడం కోసమే కాకుండా వారి కీర్తిని చాటేలా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని మాజీ మేయర్ రాగే పరుశురాం అన్నారు. శుక్రవారం కృష్ణ సేన నాయకుడు కుళ్లాయప్ప ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ బాలభవన్ సమీపంలో సినీ నటుడు మహేష్‌బాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాజీ మేయర్ రాగే పరుశురాం కేక్ కట్ చేసి అందరితో సంతోషాలను పంచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహేష్ బాబు అభిమానులు విస్తృతంగా సేవా కార్యక్రమాలను చేపడుతుండటం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవిరాజ్, విజయకృష్ణ, శ్రీనివాసరెడ్డి, రఫీ, శేఖరబాబు, నారాయణరెడ్డి, వెంకటేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జడ్జి శివప్రసాద్

అంతపురం రూరల్: ఉచిత న్యాయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఏ. నారాయణపురం పంచాయతీ సచివాలయం-1 వద్ద న్యాయ సంబంధిత విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అర్హత ఉండి పింఛన్లు అందని వారికి పింఛన్లు అందించాలని సూచించారు. ప్రమాదాలు సంభవించిన సమయంలో మరణించినా, గాయపడినా సంబంధిత సంస్థలు, వ్యక్తుల నుంచి నష్టపరిహారం ఎలా పొందాలో వివరించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు, డీఆర్‌డీఏ పీడీ ఓబులమ్మ, ఎంపీడీఓ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ శిల్పం బోర్డు ధ్వంసం దుర్మార్గం

రాప్తాడు: విజయవాడ నడిబొడ్డున రాష్ట్రానికి తలమానికంగా ఉన్న అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై పచ్చ మూకల దాడి దుర్మార్గమని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నల రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన చంద్రబాబు నాయుడు టీడీపీ అల్లరి మూకలను వెనకేసుకుని రావడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. భారత రాజ్యాంగం, ఎస్సీ, ఎస్టీల మనోభావాలను అవమానపరిచినట్లే అన్నారు. సామాజిక న్యాయ మహాశిల్పం బోర్డు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేరు ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కార్పొరేట్ కంపెనీలను తరిమికొడదాం



నిరసన తెలుపుతున్న రైతు, వ్యవసాయ, రైతు కూలీ సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: కార్మిక హక్కులను కాలరాస్తున్న కార్పొరేట్ కంపెనీలను క్విట్ ఇండియా స్ఫూర్తితో తరిమికొడదామని రైతు, కార్మిక, రైతుల కూలీ, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా నినాదంతో సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్ప యాదవ్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక లలిత కళాపరిషత్ నుంచి టవర్ క్లాక్ వరకూ ర్యాలీ చేపట్టారు. అక్కడ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘాలు, కార్మిక సంఘాల కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, మల్లికార్జున, రాజారెడ్డి, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, బాలరంగయ్య, నాగమణి, రాజేష్‌గౌడ్ తదితరులు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రైవేటీకరించే విధానాలు అమలు చేస్తోందన్నారు. దేశంలో విత్తన వ్యాపారం పూర్తిగా మోన్‌శాంటో, కార్గిల్ వంటి బహుళజాతి కంపెనీ చేతుల్లో ఉందన్నారు. రైతులను రక్షించే విత్తన చట్టం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల బీమా పథకాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు మల్లీశ్వరి, ఏసురత్నం, వెంకటనారాయణ, నాగరాజు, తిరుమలేష్, ఎ.మల్లికార్జున, చిరంజీవి, రాజు, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ , నాగేంద్ర, లలితమ్మ, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ లక్ష్మీ నమోస్తుతే..



కొత్తూరు అమ్మవారి శాలలో పూజలు చేస్తున్న మహిళలు

పవిత్ర శ్రావణమాసంలో వచ్చిన తొలి శుక్రవారం కావడంతో నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వాడవాడలా అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి. నగరంలోని కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం, హెచ్చెల్సీ కాలనీలోని ననకోట ముత్యాలమ్మ ఆలయం, రామనగర్‌లోని పెద్దమ్మ తల్లి దేవాలయం, శంకరమఠంలో శారదా మాత, శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరి, శివకోటి తదితర చోట్ల పెద్ద ఎత్తున పూజలు జరిగాయి. అమ్మవార్లను భక్తులు బారులు తీరి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. – అనంతపురం కల్చరల్:

కాలువల్లో చెత్త వేయొద్దు



కార్మికులతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: కాలువల్లో చెత్త వేయకూడదని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శ్రీహరిబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ ఆర్డీ, నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన నగరంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కాలువల్లో చెత్త వేయడం ద్వారా కాలువలు బ్లాక్ అయ్యే ప్రమాదం లేకపోలేదన్నారు. తద్వార వర్షాకాలంలో మురుగు రివర్స్‌లో వెనక్కి వచ్చి, దోమకాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో వ్యవహరించాలన్నారు. కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికను తీయాలని నగరపాలక సంస్థ సిబ్బందిని ఆదేశించారు. రోడ్లపై చెత్త కనిపించకూడదన్నారు. షెడ్యూల్ ప్రకారం వివిధ డివిజన్లలో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు.

ఐఎంఏ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసులకు చోటు



డాక్టర్ హేమలత



డాక్టర్ జే.శ్రీనాథ్



డాక్టర్ మనోరంజన్ రెడ్డి



డాక్టర్ అభిషేక్ రెడ్డి

అనంతపురం మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో అనంతపురం జిల్లా వాసులకు చోటు లభించింది. శుక్రవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యవర్గంలో ఎన్నికైన వారి పేర్లను ప్రకటించింది. ఐఎంఏ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఐఎంఏ అకాడమీ మెడికల్ స్పెషాలిటీస్ చైర్‌పర్సన్‌గా ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ జే.శ్రీనాథ్, ఐఎంఏ స్టేట్ వర్కింగ్ కమిటీ ఎగ్జిక్యూటివ్‌లుగా జీజీహెచ్‌లో రేడియాలజిస్టుగా విధులు నిర్వర్తించే డాక్టర్ మనోరంజన్ రెడ్డి, ప్రముఖ ఆర్థో వైద్యులు డాక్టర్ అభిషేక్ రెడ్డి నియమితులయ్యారు.

'పరేడ్' సాధన

అనంతపురం: ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు పంద్రాగస్టు వేడుకలకు పోలీసు బలగాలు సాధన చేస్తున్నాయి. పరేడ్ మైదానంలో కొనసాగుతున్న రిహార్సల్స్‌ను ఏఆర్ డీఎస్పీ మునిరాజ శుక్రవారం పర్యవేక్షించారు. ఏఆర్ సాయుధ పోలీసు బలగాలతో పాటు డాగ్‌స్క్వాడ్, ఎన్‌సీసీ విద్యార్థులు సాధన చేశారు. జాతీయ సమైక్యత, దేశభక్తి వెల్లివిరిసేలా, నలుదిశలా వ్యాపించేలా పరేడ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ మధు, రాముడు, ఆర్ఎస్ఐలు జాఫర్, ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వెంకట రమణమ్మ సర్వర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె కుమారుడు ఎస్.రామకృష్ణకు శుక్రవారం కారుణ్య నియామకం కింద అటెండర్‌గా ఉద్యోగం ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగ నియామక పత్రాన్ని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత, రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్ బాబు అందజేశారు.

విద్యుత్ ఉద్యోగుల క్రీడాపోటీల్లో 'అనంత' విజేత



విజేత ట్రోఫీ అందుకుంటున్న అనంతపురం జట్టు సభ్యులు

అనంతపురం టౌన్: విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. నంద్యాల జిల్లా సున్నిపెంటలో వారం రోజులుగా క్రీడా పోటీలు జరిగాయి. శుక్రవారం సాయంత్రం జరిగిన బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో కర్నూలు జిల్లాతో తలపడి విజేత ట్రోఫీని అనంత క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జట్టు కెప్టెన్ ప్రభాకర్, వెంకటనారాయణ, శివకుమార్, అనిల్, బాబా, రవి, పవన్‌ను ఆ శాఖ ఉన్నతాధికారులు అభినందించారు.